# ఇన్లాండ్ లెటర్ కథలు

## విచిత్రప్రేమ

మాధవరావుగారికి ఇద్దరు కూతుళ్లు. ఒక కొడుకు ఆయన అదోరకం మనిషి. కొంచెం కోపిష్టి. ఆయన భార్య వసంతమ్మగారు పిల్లల చిన్న వయస్సులోనే చనిపోయారు. ఆయన మరో పెళ్లి చేసుకోకుండానే, పిల్లల్ని పెంచి పెద్దచేశారు. పెద్దమ్మాయికి యుక్తవయసు రాగానే పెళ్ళిచేశారు. చిన్నకూతురు సుభ కాలేజి చదువుకునే రోజుల్లో సురేష్ అనే అతనితో స్నేహం పెంచుకుంది. అతన్ని ప్రేమించింది. కాని అతనితో ఆ విషయం చెప్పలేదు. అంత ధైర్యం ఆమెకు రాలేదు. అతను ఆమెను ప్రేమిస్తున్నాడో లేదో తెలియదు. కాలేజిని విడిచినా అతనిమీద ఆమెకున్న ప్రేమ తరగలేదు కాని ఎన్నిసార్లు అతనితో చెబుదామన్న చెప్పలేకపోతుంది. అతను తన ప్రేమను తిరస్కరిస్తాడేమోనని ఆమె భయం. ఇలా మూడు సంవత్సరాలు గడిచాయి. మాధవరావుగారు ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టాడు. తను సురేష్‌ను ప్రేమించినట్టు చెప్పలేదు. పెళ్లి సంబంధాలు చూడొద్దని చెప్పలేదు. మాధవరావుగారు సుభకి ఒక సంబంధం చూశారు. ఆ సంబంధం అతనికి అన్ని విధాలా నచ్చింది. సుభకూడా పెళ్లికొడుకు వారికి నచ్చింది. పెళ్లికి ముహూర్తాలుకూడా పెట్టించారు. సుభ అయిష్టంగానే పెళ్లికి ఒప్పకుంది. వాళ్ళ నాన్నను ఎదిరించి, తన మసులోని మాట అతనికి చెప్పే ధైర్యం ఆమెకు లేదు. పెళ్ళిఅయిన దగ్గరనుంచి సుభ ముభావంగా వుంది. పెళ్లికొడుకు (సుభ భర్త)కూడా అలానే వున్నాడు. ఆయనదీ ఇలాంటి కథే. కాకపోతే మగవాడుకదా ఎదిరించి (తల్లిదండ్రులను) చూశాడు. కాని అతని తల్లిదండ్రులు అతను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి ఒప్పకోలేదు సరికదా



తాముచూసిన సంబంధం చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుని చస్తామని బెదిరించారు. గతిలేక మురళి (సుభ భర్త) పెళ్లికి ఒప్పకున్నాడు. ఇక్కడ వీళ్ల పరిస్థితి ఇలావుండగా అక్కడ సురేష్‌కి పెళ్ళిఅయింది. ఆయన భార్య సుగుణ.

ఒకనాడు మురళి వాళ్ల అమ్మానాన్న బలవంతంతో సుభను తీసుకుని బయటికి వెళతారు. వారు ఒక హోటల్‌కి వెళతారు. అక్కడ వారికి సురేష్, సుగుణ కనపడతారు. సుభ తన భర్త మురళికి సురేష్ తన క్లోజ్‌ఫ్రెండ్ అని పరిచయం చేస్తుంది. సురేష్ తన భార్య సుగుణని సుభ, మురళిలకు పరిచయం చేస్తాడు. మురళి సుగుణని చూసి నిశ్చేష్టుడైపోతాడు. సుగుణకూడా మురళిని చూసి ఆశ్చర్యపోతుంది. కారణం మురళి పూర్వం ప్రేమించింది సుగుణనే. చూసారా విధి ఎలాంటిదో. సురేష్‌కి కావలసిన భార్యను మురళికి, మురళికి కావలసిన భార్యను సురేష్‌కు అయ్యేటట్లు చేసింది. కాని ఇది విధి వైపరీత్యం కాదు. ప్రేమికులలోపంకూడా. నిజమైన ప్రేమికులు ఎప్పుడూ విధినికూడా ఎదిరించి నిలబడాలి. ప్రేమకు ఎప్పుడూ కావలసింది. ధైర్యం పిరికిదనం కాదు. పిరికితనం వున్నవాళ్లు ప్రేమించకూడదు. ఈ పెద్దవాళ్ళు తమకు ఇష్టంలేని పెళ్లిచేసుకుంటే చనిపోతామని బెదిరించడం మామూలైపోయింది. ఏ పిల్లలూ తమ తల్లిదండ్రులను చంపుకోవాలని అనుకోరు కదా. ప్రేమికులను విడదీయటానికి పెద్దవాళ్లు పన్నే పన్నాగం ఇది. ప్రేమికులకు తెగింపు, ధైర్యం, సాహసం వుండాలి. అప్పుడే ప్రేమ విజయం సాధిస్తుంది. ఏదిఏమైనా ఇది విచిత్ర ప్రేమ కదూ!

—రచన, అక్కయ్యపాలెం



## సీతకాదు

సీతా! సీతా!... రాజ్యం! సీత కనబడడం లేదేంటి? ఆఫీసునుంచి వచ్చిన చంద్రమౌళిగారు అడిగారు తన భార్యని. మాధురితో స్కూల్‌కి వెళ్ళిందండీ, ఎంత చెప్పినా మాధురీ వినలేదు. తనతోకూడా తీసుకెళ్తానంది. అది అల్లరిచేస్తే టీచర్ తిడతాడో ఏంటో? అంది రాజ్యం. సీతకు అన్నం పెట్టావా? అడిగారు. ఆ పెట్టానండీ మాధురీ సీతా కలిసి తిన్నారు...

ఏంటోనోయ్ సీతతో మనకున్న అనుబంధం సీతను చూడలేకుండాఉండలేం మాధురికంటే కూడా సీత మీద అభిమానం పెరిగిపోతుంది అంటూ ఎవరో తలుపుకొట్టారు. అంకుల్... అంకుల్... సీత మా నూతిలో పడిపోయింది అంటూ చెప్పాడు రాఘవ...

అదేంటి మాసీత మాధురితో స్కూల్ కెళ్లింది!!! ఆ రఘూ నువ్వు స్కూల్‌కెళ్లిచూడు. ఏమే పద నూతిలో చూద్దాం... అచాడు అందుకో అంటూ ఆదుర్దాగా నూతి దగ్గరకు పరిగెట్టారు మౌళిగారు. అక్కడ వున్న మరో నలుగురు పిల్లలు అంకుల్ ఈగోడమీంచి వడిచింది మీ సీత. కాలుజారి దాంట్లో పడిపోయింది.

అంతాకలిసి నూతిలో ఒక 'బకెట్'కు తాడుకట్టి దించారు. ఇంతలో రఘూ పరిగెట్టుకుంటూ వచ్చి అంకుల్ మీ సీత ఇదిగో క్షేమంగా వుంది. టీచర్ దెబ్బలాడారు. పిల్లలంతా చదువుమాని దీన్నే చూస్తున్నారంట అంటూ సీతను అందించాడు చంద్రమౌళి గారికి. ఆయన్ను చూసిన వెంటనే ఆప్యాయంగా 'మ్యావ్...' అంది సీత. తన సీత క్షేమంగా వుంది ఆనందించారు. అయితే నూతిలో పడినదెవరూ? అంటూ అంతా ఆలోచించారు. ఇంతలో పక్కవాటా వాళ్ల అబ్బాయివచ్చి... అంకుల్ నూతిలో పడింది మీ పిల్లికాదు. మా పిల్లి అంటూ ఏడ్చాడు. ఎలాగైతేనేం అంతాకలిసి పిల్లిని తీద్దామని ప్రయత్నిస్తున్నాం... ఇంతలో సీత ఎవరితోనో దెబ్బలాడుకోవడం జరుగుతుంది. మ్యావ్... మ్యావ్... ఘుర్... ఘుర్.. అన్న శబ్దానికి అందరం తలతిప్పిచూసాం. అంకుల్ అదిగో మా పిల్లి! మీ సీత మాపిల్లి రెండు ఇక్కడే వున్నాయి. నూతిలో పడింది నేనువేసిన రాయి అని చెప్పాడు రాఘవ తమ్ముడు. అంతా ఆనందంతో నవ్వేసారు...

—కె.ఉమాగణేష్
(బ్రహ్మంమాస్టారు)
చోడవరం, వ్యాపారవీధి.